క్లుప్తంగా

నేడు డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్

నెహ్రూ నగర్: డయల్ యువర్ కమిషనర్ (0863–2224202) కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ చాంబర్‌లో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని నగర కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

కూటమి హామీలను అమలు చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల



లక్ష్మీపురం: కూటమి ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శ్రీనగర్ కాలనీలోని మహబూబ్ జెండా చెట్టు 51వ డివిజన్ సీపీఐ శాఖ మహాసభ ఆదివారం నిర్వహించారు. సభ రెహమాన్ అధ్యక్షత వహించారు. నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ డివిజన్ శాఖ కార్యదర్శిగా షేక్ వలితో పాటు తొమ్మిది మందిని ఎన్నుకున్నట్లు చెప్పారు.

నగర వాసులకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా చూడాలి

లక్ష్మీపురం: శంకర్‌విలాస్ బ్రిడ్జి పనులు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో నగరవాసులకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా చూడాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి కోరారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం సమావేశంలో నిర్వహించారు.

వైభవంగా అంజన్నకు పూజలు



ఫిరంగిపురం: ఫిరంగిపురం మండలం వేమవరం గ్రామంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామివారి 21వ వార్షికోత్సవం ఈనెల 7న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం పదహారు రోజుల పండుగను విశేషంగా జరిపారు. ఉదయాన్నే స్వామికి నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. పొంగళ్లను స్వామివారికి నివేదన చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త పొట్టి వీరేశం గుప్తా, గ్రామపెద్ద కె.పేరారెడ్డిలు పర్యవేక్షించారు.

జన సమీకరణ చేశారంటూ కేసు నమోదు

గుంటూరు రూరల్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు పర్యటన సందర్భంగా గ్రామాల్లో జన సమీకరణ చేయరాదని నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ముందస్తుగా హెచ్చరిక నోటీసులు అందించారు. అయినప్పటికీ వైఎస్సార్‌సీపీ నాయకులు జన సమీకరణ చేశారని కేసు నమోదు చేసిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఆదివారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాలు ఇలా.. జగనన్న పర్యటనకు జనాలను సమీకరించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని రూరల్ మండలం ఎంపీపీ ఇంటూరి అంజిరెడ్డి, నల్లపాడు డివిజన్ కన్వీనర్ దుగ్గెంపూడి యోగేశ్వర్‌రెడ్డి, చెంచిరెడ్డి, తియ్యగూర శ్రీనివాసరెడ్డి, పార్థురెడ్డిలపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఐదుగురినీ పోలీస్ స్టేషన్‌కు పిలిచి కౌన్సిలింగ్ నిర్వహించి స్టేషన్ బెయిల్‌ను ఇచ్చి పంపారని సమాచారం.

ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షునిగా ఏసుబాబు



కాకుమాను: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షునిగా కాకుమానుకు చెందిన వినుకొండ ఏసుబాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర కో–కన్వీనర్ ఏటుకూరి విజయ్ కుమార్ మాదిగ తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసూరుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆదేశాల మేరకు ఆదివారం ఏసుబాబును నియోజకవర్గ అధ్యక్షునిగా ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా ఏసుబాబు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని మాదిగలందరినీ ఏకతాటిపై నడిపించి వారి సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానని అన్నారు. అనంతరం జూలై 7వ తేదీన ఒంగోలులో నిర్వహించనున్న మాదిగ మహామేళ పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెద సుబ్బారావు మాదిగ, వందనం మాదిగ, ఇస్రాయేలు మాదిగ, శ్రీను మాదిగ, సురేష్ మాదిగ, పుష్పరాజ్ మాదిగ, హనుమంతరావు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన వీణా కచేరి



నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 2/14వ అడ్డరోడ్డులోని నాగార్జున సాంస్కృతిక కేంద్రం, నాగార్జున సంగీత కళాశాల ఆవరణలో ఆదివారం సాయంత్రం లక్ష్మీశ్రీనివాస్ వీణా కచేరి నిర్వహించారు. తొలుత ఈమని శంకర శాస్త్రి చిత్ర పటానికి పూలమాలలతో నివాళులర్పించారు. నాగార్జున స్కూల్ ఆఫ్ మ్యూజిక్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వాణిజ్య, వ్యాపార పరిపాలన విభాగం డీన్ ఆచార్య శివరామ్‌ప్రసాద్ హాజరై, మాట్లాడారు. అనంతరం కళాకారులను సత్కరించారు. బి.సురేష్‌బాబు, మృదంగం అందించారు.

శాస్త్రీయ సంగీత కచేరి..



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజ కళావేదికపై ఆదివారం సాయంత్రం శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ అధ్యక్షత వహించారు. ప్రముఖ సంగీత విద్వాంసులు ప్రీతి సేతురామన్(చెన్నై) త్యాగరాజ కీర్తనలతోపాటు వాగ్గేయకార కీర్తలను ఆలపించారు. వయోలిన్‌పై గాయత్రీ విభావరి, మృదంగంపై అజిత్ శ్రీధర్ (చెన్నై) వాయిద్యాన్ని అందించారు. కళాకారులను ఉపాధ్యక్షులు ఎస్. గిరిజాశంకర్ సత్కరించారు.

కిమ్స్ శిఖర హాస్పిటల్‌లో ఏఐతో గుండె చికిత్సలు

- డాక్టర్ పర్వతనేని నాగశ్రీహరిత
- ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ చికిత్సలతో రోగికి మేలు


చికిత్స విధానాన్ని వివరిస్తున్న డాక్టర్ పర్వతనేని నాగశ్రీహరిత, డాక్టర్ అకుల శివప్రసాద్

గుంటూరు మెడికల్: ఏపీలో మొట్టమొదటి సారిగా గుంటూరు కిమ్స్ శిఖర హాస్పటల్‌లో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి గుండె సమస్యలు గుర్తించి, చికిత్సలు చేస్తున్నామని సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, కార్డియాక్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ పర్వతనేని నాగ శ్రీ హరిత తెలిపారు. ఆదివారం గుంటూరు మంగళదాస్‌నగర్‌లోని హాస్పిటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బోస్టన్ సైంటిఫిక్ సంస్థ రూపొందించిన ఆధునిక ఏవీవీఐజీఓ, ఐవీయూఎస్ కన్సోల్‌ను మొట్టమొదటిసారిగా ఏపీలో తమ ఆస్పత్రి అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. ఏఐ ద్వారా గుండెలో రక్తనాళాల్లో బ్లాక్స్ ఎంత శాతం ఉన్నాయో చాలా క్లియర్‌గా తెలుస్తుందని చెప్పారు. మిల్లీమీటర్ ప్రకారం చెప్పగలిగే మెషిన్‌ను తాము గుంటూరు హాస్పిటల్‌లో అందుబాటులోకి తెచ్చామన్నారు. ఐవాస్ మెషిన్ ద్వారా గతంలో కూడా తాము గుండె చికిత్సలు చేశామని, నేడు దీనికి ఏఐను జోడించి గుండె చికిత్సలు చేస్తున్నట్లు వెల్లడించారు. రక్తనాళాల్లో బ్లడ్ ఫ్లోటింగ్ ఎలా ఉంది, ఎక్కువగా ఉందా లేదా తక్కువగా ఉందా తెలుసుకోవచ్చన్నారు. బ్లాక్స్‌కు స్టంట్ వేయకుండా చికిత్స చేయవచ్చా లేదా అనే విషయాలు కూడా చాలా కచ్చితంగా తెలుస్తాయని వివరించారు. ఐఏ చికిత్సలతో రోగికి బహుళ ప్రయోజనాలు ఉంటాయని, వైద్య చికిత్సల్లో, వ్యాధి నిర్ధారణలో నూటికి నూరు శాతం కచ్చితత్వం ఉంటుందన్నారు. వైద్యులు తాము చికిత్సలు చేసేందుకు ఏఐ సాంకేతిక ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈ సాంకేతిక పరికరం అంతర్గత రక్తనాళాల చిత్రీకరణ(ఇంట్రావాస్క్యులర్ ఇమేజింగ్), ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ రంగాల్లో కీలక అంశాలను ఈ సాంకేతికతను ఉపయోగించి తెలుసుకోవచ్చని సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అకుల శివ ప్రసాద్ పేర్కొన్నారు. శస్త్రచికిత్సల సమయంలో రక్తనాళాలలో జరిగే అత్యద్భుతమైన స్పష్టతతో తక్షణ చిత్రాల ద్వారా వైద్యుల నిర్ణయ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందని చెప్పారు. క్లిష్టమైన గుండె ఆపరేషన్ల ఫలితాలను మెరుగుపరచడంలో కీలక ఈ నూతన సాంకేతికతో కూడిన వైద్య పరికరం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

శ్రీనగర్‌లో విద్యుత్ కష్టాలు

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీనగర్ ఏడో లైను ప్రజలు విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 7/7వ లైనులోని పుట్టగుడి ప్రాంతాన్ని లో–ఓల్టేజ్ సమస్య వెంటాడుతోంది. శనివారం రాత్రి 9.00 గంటల సమయంలో ఈ ప్రాంతంలోని కొన్ని ఇళ్లకే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఎదురైంది. దీంతో స్థానికులు విద్యుత్‌శాఖ కార్యాలయానికి ఫోన్లు చేసి సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ శాఖ సిబ్బంది వచ్చి ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఫ్యూజ్ బాక్సులో లోపాన్ని సరి చేసి వెళ్లారు. ఈ విధంగా ఒక్కసారి కాదు. అర్ధరాత్రి 12 గంటల వరకు పదే, పదే విద్యుత్ సరఫరాలో లోపం తలెత్తడం, స్థానికులు ఫోన్లు చేయడంతో సిబ్బంది వచ్చి సరి చేయడం సరిపోయింది. ఈ విధంగా శనివారం విద్యుత్ సరఫరా లేక, ఉక్కపోతతో ప్రజలు జాగారం చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ నిత్యం మరమ్మతులకు గురి కావడంతో పాటు అదనపు లోడ్ పడినప్పుడు లో–ఓల్టేజ్ సమస్య తలెత్తుతోంది. దీంతో పాటు కొన్ని ఇళ్లకే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండటంతో గత కొన్ని నెలలుగా వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నెలకు వేలాది రూపాయలు బిల్లులు చెల్లిస్తున్నప్పటికీ, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఆదర్శంగా నిలుస్తోన్న క్లబ్ సేవా కార్యక్రమాలు


బియ్యం కిట్లు పంపిణీ చేస్తున్న క్లబ్ నిర్వాహకులు

నగరంపాలెం: స్థానిక ఆర్‌అగ్రహారంలో వాసవి క్లబ్ గుంటూరు, మహిళా గుంటూరు, యువ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 108 మంది వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, పింఛన్లు, దాదాపు 300 మందికి మధుమేహ రక్త పరీక్షలు, రైతుకు సన్మానం, ఇద్దరికి చెప్పులు కుట్టుకునే ఉపకరణాలు, రెండు సిమెంట్ బెంచీలును పంపిణీ చేశారు. వాసవిక్లబ్ గుంటూరు అధ్యక్షులు రాయవరపు అశోక్ కుమార్ అధ్యక్షత వహించారు. క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షులు కనమర్లపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో వాసవి క్లబ్ గుంటూరు నిర్వహించే సేవా కార్యక్రమాలు అందరికి ఆదర్శంగా ఉన్నాయని అన్నారు. క్లబ్ సేవలను ఆయన అభినందించారు. అధ్యక్షత వహించిన క్లబ్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో సేవలను విస్తరిస్తామని అన్నారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి కూనిశెట్టి చంద్రశేఖరరావు, కోశాధికారి వేమూరి ప్రదీప్‌కుమార్, మహిళా క్లబ్ అధ్యక్షురాలు రాయవరపు అనూరాధ, ప్రధాన కార్యదర్శి కూనిశెట్టి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ముస్లిం యునైటెడ్ ఫ్రంట్‌ను బలోపేతం చేయాలి


పలువురికి నియామక పత్రాలను అందజేస్తున్న ఎండీ కలీం

లక్ష్మీపురం: ప్రస్తుత పరిస్థితుల్లో ముస్లిం యునైటెడ్ ఫ్రంట్(ఎంయూఎఫ్)ను గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం స్థాయిలో బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సంఘం అధ్యక్షుడు మహమ్మద్ కలీం తెలిపారు. ఆదివారం స్థానిక ఏసీ కాలేజ్ సమీపంలోని అంబేడ్కర్ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వక్ఫ్ సంస్థలోని అవకతవకలపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. మసీదు, దర్గా, పీర్ల మాన్యాలు లాంటి తదితర ధార్మిక సంస్థలు కు చెందిన అన్యాక్రాంతమైన ఆస్తులు, భూములను తిరిగి స్వాధీనం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి మాట్లాడుతూ ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ కు తమ సంస్థ ఎల్లప్పుడు సహకారాన్ని అందిస్తుందని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జిగా షేక్ గౌస్ బాషా, పశ్చిమ ఇన్‌చార్జి సయ్యద్ ఆదం సాహెబ్, ముస్లిం ఎంప్లాయీస్ యునైటెడ్ ఫ్రంట్ విభాగానికి ఇన్‌చార్జిగా షేక్ మీరావలిని నియమిస్తూ నియామక పత్రాలను మహమ్మద్ కలీం అందజేశారు.

హార్మోన్ల సమతుల్యతతోనే ఆరోగ్యం



ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న ప్రముఖ ఎండోక్రనాలజిస్ట్ ఉమామహేశ్వరరావు

లక్ష్మీపురం: శరీరంలో హార్మోన్ల సమతుల్యతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ప్రముఖ ఎండోక్రనాలజిస్ట్ డాక్టర్ జి.ఉమామహేశ్వరరావు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆరోగ్య సభ ఆదివారం నిర్వహించారు. సభకు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో చాలామంది శారీరక వ్యాయామం లేక, అధిక మొత్తంలో ఆహారం తీసుకుంటూ, స్వచ్ఛమైన వాతావరణంలో జీవించక అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటూ వారానికి ఐదు రోజులు రోజుకు 45 నిమిషాలు వ్యాయామం చేస్తూ ప్రశాంతంగా ఉంటూ మంచి వాతావరణంలో జీవిస్తూ మంచి ఆలోచనలు చేస్తుండన్నారు. అనంతరం అవగాహన సభ్యులు డాక్టర్ ఉమామహేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఆరోగ్య సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, గాయత్రి బ్యాంక్ మేనేజర్ టి.సుబ్బారావు, వేమన ట్రస్ట్ అధ్యక్షుడు చల్లా అంజిరెడ్డి, హ్యూమన్ రాడికలిస్ట్ కే చంద్రశేఖరరావు పాల్గొని ప్రసంగించారు.

వృద్ధ మహిళలూ.. పారాహుషార్!



స్థానిక ముత్యంశెట్టిపాలెంలో తూర్పు కాల్వకట్ట రోడ్డులో కబేళా వంతెన – వైకుంఠపురం మధ్య అయ్యప్పస్వామి గుడి వద్ద టిఫిన్ బండి వ్యాపారం చేస్తుండే ఆరవై ఏళ్ల తాడిపత్రి మల్లీశ్వరి ఈనెల 3వ తేదీన హత్యకు గురైన విషయం తెలిసిందే. ప్రతిరోజూ తెల్లవారుజామున 4.30 గంటలకు నిద్రలేచి, ఉదయాన్నే టిఫిన్ బండిపై విక్రయాలు చేస్తుండే మల్లీశ్వరి, ఆ రోజు బండి పెట్టలేదు. అక్కడికి సమీపంలోనే నివాసం ఉంటున్న కుమార్తెకు సమాచారం తెలిసింది. ఏమైందోనని వచ్చిన కుమార్తెకు తన ఇంట్లోనే మంచంపై చనిపోయి పడున్న తల్లి కనిపించింది. ఒంటిపై బంగారు నగలు లేవు... బీరువా కూడా తెరిచే ఉంది. అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసు దర్యాప్తులో ఆ ఇంటికి సమీపంలోనే ఉంటున్న 24 ఏళ్ల యువకుడు నన్నెపాముల తారకజోషి తన సోదరుడితో కలిసి ఈ దారుణానికి పాల్పడ్డాడు. మల్లీశ్వరి ధరించే బంగారు నగల కోసమే ఆమెను హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించిన విషయం తెలిసిందే. దొంగిలించిన బంగారు ఆభరణాలను సంగం జాగర్లమూడిలో తనతో వివాహేతర సంబంధమున్న కీర్తి అనే మహిళకు, తారకజోషి ఇచ్చాడు. ఆమె వెంటనే వాటిని తాకట్టు పెట్టి డబ్బు చేసుకుంది. ఈ కేసులో ఆమెను కూడా అరెస్టు చేశారు.


తాడిపత్రి మల్లీశ్వరి (ఫైల్)

- నెలరోజుల వ్యవధిలో నలుగురు హత్య
- బంగారం కోసమే ఈ ఘాతుకాలు
- ఒంటరి మహిళలకు హెచ్చరిక సంకేతాలు

ఒంటరి వృద్ధ మహిళలే లక్ష్యం

తెనాలి: పట్టణంలో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధ మహిళలు నేరస్తులకు టార్గెట్ అవుతున్నారు. గత నెలరోజుల వ్యవధిలో నలుగురు హత్యకు గురవటమే ఇందుకు నిదర్శనం. కేవలం బంగారు ఆభరణాల కోసమే వారి ప్రాణాలను నిలువునా తీశారు. ఈజీ మనీ కోసం, వ్యసనాలకు బానిసలైనవారు ఇటువంటి ఘోరాలకు పాల్పడుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరా సాక్ష్యాలు, పోలీసుల అప్రమత్తతతో నిందితులు దొరికినా, ఆయా ఘాతుకాలు, ఒంటరిగా ఉండే మహిళలు తగిన జాగ్రత్తలు తీసుకోవటం తప్పనిసరిగా హెచ్చరిస్తున్నాయి.

గత నెల 25న మరో వృద్ధురాలిని..

పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని చేసిన విచారణతో విస్తుపోయే నిజాలు తెలిశాయి. గత నెల 25వ తేదీన రెండు గేట్ల మధ్య రోడ్డులో ఒంటరిగా నివసిస్తున్న 65 ఏళ్ల మహిళ చావలి సుభాషిణి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతిచెందారు. ఆమె శరీరంపై గాట్లు ఉండటం, నిత్యం వేసుకునే బంగారం లేకపోవటంతో వేరే ప్రాంతాల్లో నివసిస్తున్న బిడ్డలకు అనుమానం వచ్చినా, ఎందుకో వారు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. సుభాషిణి మృతివెనుక కుసుమకుమారి బ్యాచ్ హస్తమున్నట్టు పోలీసుల విచారణలో వెల్లడైనట్టు తెలిసింది.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్(ఫైల్)

త్రుటిలో తప్పించుకున్న మరో వృద్ధురాలు

ఆ తర్వాత అక్కడికి సమీపంలోని ద్వారకానగర్‌లో ఒక వృద్ధ మహిళ అనుపానులు తెలుసుకుని, ఆమెను కూడా ఇదే బ్యాచ్ టార్గెట్ చేసిందట! ప్లాను అమలుచేయాల్సిన రోజు ఉదయాన్నే ఆ వృద్ధురాలి కొడుకు వచ్చి, ఆమెను తనతో తీసుకెళ్లాడట! దీనితో వారి ప్లాన్ ఫెయిలైంది. హత్యకు గురైన నలుగురు మహిళలు ఒంటరిగా నివసిస్తుండటం, వారికి పరిచయస్తులే హత్యలకు పాల్పడటం గమనించాల్సిన అంశం. దీనితో ఒంటరిగా ఉండేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన ఆవశ్యకత కనిపిస్తోంది.


జంట హత్యల కలకలం


దాసరి రాజేశ్వరి(ఫైల్)


పిట్టా అంజమ్మ(ఫైల్)

ఈనెల 19వ తేదీన చినపరిమికి వెళ్లే రోడ్డులో మూసివేసిన అప్పడాల కంపెనీ పైభాగంలో ఉంటున్న ఇద్దరు వృద్ధులు దాసరి రాజేశ్వరి (65), పిట్టా అంజమ్మ (70) పట్టపగలు హత్యకు గురైన విషయం తెలిసిందే. అదే ఏరియాలో ఉంటున్న ప్రైవేటు బీమా ఏజెంటుగా చేస్తున్న కుసుమకుమారి అనే మహిళ, ఆటో డ్రైవర్, మరో యువకుడితో కలిసి ఈ నేరానికి పాల్పడినట్టు పోలీసులు నిర్ధారణకొచ్చారు. ఆటోలో అక్కడకు వచ్చిన ఆ ముగ్గురిలో ముందుగా కుసుమకుమారి ఆ ఇంటి లోపలకు వెళ్లింది. మూతపడిన అప్పడాల కంపెనీ భాగాన్ని అద్దెకు తీసుకుంటానికి వచ్చారని ఒకరి తర్వాత ఒకరిని కిందకు పిలిచింది. అంతా కలిసి ఆ ఇద్దరిని మట్టుపెట్టారు. ఒకరిపై ఒకరు దాడిచేసుకుని మరణించినట్టు కనిపించేలా ఒకరి చేతిలో తూకం రాయి, మరొకరి చేతిలో కర్ర ఉంచి, ఆ ఇద్దరు ధరించిన బంగారు నగలను వొలుచుకుని తాపీగా వెళ్లిపోయారు. అదేరోజు ఎదురింట్లో శుభకార్యం జరిగింది, సాయంత్రం అవుతున్నా భోజనానికి రాలేదేమిటాని వారు ఆరా తీయటంతో విషయం వెలుగులోకి వచ్చింది. నిందితులను సీసీ కెమెరా పట్టిచ్చింది.

ఒంటరి మహిళలు జాగ్రత్తగా ఉండాలి..



ఒంటరిగా ఉంటున్న మహిళలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలి. ఇళ్లకు సీసీ కెమెరా, అలారం సిస్టమ్ ఏర్పాటు చేసుకోవడం మంచిది. ఇంట్లో ఉన్నపుడు బంగారు ఆభరణాలు ధరించరాదు. ఇంట్లో నగదు కూడా ఎక్కువగా ఉంచుకోవద్దని సూచన. బంగారు ఆభరణాలు, నగదు కోసం హత్యలు జరుగుతున్నందున అప్రమత్తంగా ఉండటం అవసరం.

– బి.జనార్ధనరావు, డీఎస్పీ, తెనాలి

అవోపా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా అవోపా గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం మాట్లాడుతూ అవోపా సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న 260 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రముఖ మధుమేహ వైద్య నిపుణుడు రామ్‌కుమార్ మాట్లాడుతూ చిన్నపిల్లలు మొదలు పెద్దల వరకు వయసుతో నిమిత్తం లేకుండా షుగర్ వ్యాధికి గురవుతున్నారని తెలిపారు. జీవనశైలిలో మార్పులు, సక్రమ ఆహారపు అలవాట్లతో మధుమేహాన్ని నియంత్రించవచ్చునని సూచించారు. ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు భవనాసి కాశీ విశ్వనాథ మాట్లాడుతూ 40 ఏళ్లు పైబడిన అందరికీ ఎముకల సాంద్రత పరీక్షను ఉచితంగా నిర్వహించి, తగు సూచనలు చేశారు. వైద్య శిబిరంలో డాక్టర్ కె.రామలింగేశ్వరరావు, డాక్టర్ దేవరశెట్టి అమర్, డాక్టర్ కొత్తమాసు ప్రణీత్‌కుమార్, డాక్టర్ దేవరశెట్టి పద్మజ, అవోపా కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, అమరా రమేష్, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఏపీ గురుకులంలో గెస్ట్ ఉపాధ్యాయులుగా దరఖాస్తులు


తాడికొండ: తాడికొండలోని ఏపీ గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను గెస్ట్ ఉపాధ్యాయులుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.జోగారావు ఒక ప్రకటనలో తెలిపారు. మాథ్స్‌లో పీజీటీ, హిందీ సబ్జెక్టులో పీజీటీ, టీజీటీలు కావాలని అన్నారు. ఆశక్తి ఉన్నవారు తాడికొండ ఏపీ గురుకులం లేదా 87126 25037 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న సత్యనారాయణ

పెదకాకాని: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చే వరకూ సీపీఐ పోరాటం కొనసాగుతుందని పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ అన్నారు. మండలంలోని నంబూరు కార్యాలయంలో ఆదివారం గ్రామసభ నిర్వహించారు. సమావేశానికి కొల్లి రంగారెడ్డి అధ్యక్షత వహించగా సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. మండలంలో ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ నిరుపేదలకు 3 సెంట్ల స్థలం కూడా ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. పంచాయితీ అధికారులు ప్రజల కనీస అవసరాలైన తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్లు, వీధిలైట్ల విషయంలో శ్రద్ధ చూపించాలన్నారు. అనంతరం సభలో గ్రామ సీపీఐ కార్యదర్శిగా కూసం నాగిరెడ్డి, ఉప కార్యదర్శిగా భీమవరపు బ్రహ్మారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం కార్యదర్శి కంజుల విఠల్ రెడ్డి, సీహెచ్ పిచ్చేశ్వరరావు, నాగరాజు, ఆర్దల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయశాఖ భూమిలో అక్రమ తవ్వకాలు



చేబ్రోలు: దేవాదాయశాఖ భూమిలోని నల్లమట్టిని అధికార పార్టీ నాయకులు యంత్రాల సహాయంతో తవ్వకాలు చేసి విక్రయించిన సంఘటనపై ఆదివారం అధికారులకు ఫిర్యాదులు అందాయి. చేబ్రోలులోని నాగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన వ్యవసాయ భూమి కోవెలమూడి శివారులోని పాతరెడ్డిపాలెం గ్రామ పరిధిలో ఉంది. దేవాదాయశాఖకు చెందిన అధికారులు వ్యవసాయ సాగు కోసం కౌలు వేలం పాటలు నిర్వహించారు. కోవెలమూడికి చెందిన వారు పొలం కౌలుకు తీసుకొన్నారు. కౌలు దారులు గత రెండు రోజులుగా కౌలు భూమిలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తుండటంపై గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. కాలువ పూడిక తీత చేస్తున్నట్లు నమ్మించి పొలంలోని మట్టిని కూడా యంత్రాలతో తవ్వి, ట్రాక్టర్ రూ.1000 చొప్పున అమ్మకాలు చేస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై దేవాదాయశాఖాధికారి వినయకృష్ణను ఫోన్‌లో వివరణ కోరటానికి సాక్షి ప్రయత్నించగా అందుబాటులో లేరు.